‘పది’ంతల శ్రద్ధ

- టెన్త్ పరీక్షలపై స్పెషల్ ఫోకస్
- వంద రోజుల ప్రణాళికతో సన్నద్ధత
- ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి

ఆరిలోవ: ప్రతీ విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షలంటే వారిలో ఉండే భయాన్ని తొలగించి, మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం, సర్కారు బడులకు కావలసిన అన్నిరకాల సదుపాయాలను సమకూరుస్తుండడంతో ఉపాధ్యాయుల్లోనూ అదే ఉత్సాహం కనిపిస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి కీలమైన మలుపు కావడంతో, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే పట్టుదలతో ఉన్నారు. ఇందు కోసం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు కూడా సిద్ధం అంటున్నారు. ఇటీవల ప్రీ ఫైనల్–1 పరీక్షలు రాశారు. శుక్రవారం నుంచి జరిగే ప్రీ ఫైనల్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. మరో మూడు వారాలలో జరగనున్న ఫైనల్ పరీక్షలే లక్ష్యంగా శ్రమిస్తున్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సబ్జెక్టుల వారీగా చదివిస్తున్నాం..



పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. వారంతా కష్టపడి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించే విధంగా ప్రణాళిక రూపొందించాం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఒక్కో గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. 100 రోజుల ప్రణాళిక తూచా తప్పకుండా పాటిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి వద్ద కూడా విద్యార్థులను తెల్లవారుజామున చదివించాలని, వారికి పౌష్టికాహారం అందించాలని, జంగ్ ఫుడ్ తినకుండా జాగ్రత్త పడాలని సూచించాం. – దుర్గాభవాని, హెచ్‌ఎం, తోటగరువు జెడ్పీ హైస్కూల్,

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం



పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలి. మంచి గాలి, వెలుతురు ఉండే చోట్ల చదువుకోవాలి. విద్యార్థులు చదువుతున్నప్పుడు కళ్లపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. ప్రతి 20 నిమిషాల పాటు చదివిన వెంటనే 20 సెకన్లు పాటు 20 అడుగుల దూరానికి వెళ్లి(20:20:20 విధానం) ఆ పుస్తకంలో అక్షరాలను చూడాలి. కంటి రెప్పలు తరచూ మూస్తూ తెరుస్తూ ఉండాలి. దీనివల్ల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఎయిర్ కండిషన్, కూలర్లు, ఫ్యాన్‌లకు ఎదురుగా ఉండి చదవొద్దు. –అల్లూరి హిమబిందు, ఆప్తమాలజిస్ట్, చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ కన్సెల్టెంట్, ఎల్‌వీపీ కంటి ఆస్పత్రి

గ్రేడ్‌లుగా విభజించి బోధన
తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 427 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలకు సిద్ధం చేయడంలో సౌలభ్యం కోసం విద్యార్థులు చదువుతున్న తీరు, ఇంత వరకు జరిగిన పరీక్షలలో సాధించిన మార్కులను బట్టి వారిని ఉపాధ్యాయులు ఏబీసీడీ గ్రేడ్‌లుగా విభజించారు. ఆయా గ్రేడ్ల ప్రకారం వెనుకబడిన విద్యార్థులపై మరింత ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ పాఠశాలలో తెలుగు మీడియం 174 మంది, ఇంగ్లిష్ మీడియం 253 మంది ఉన్నారు. 100 రోజుల ప్రణాళిక ప్రకారం ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.


తోటగరువు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని

1 పకడ్బందీగా ప్రణాళిక
పెదగంట్యాడ మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు.

2 మోడల్ పేపర్లు
ఈ విద్యా సంవత్సరంలో కూడా ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనుండడంతో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మోడల్ పేపర్లు తయారు చేసి తర్ఫీదునిస్తున్నారు.

3 నైట్ స్టడీ
జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశాల మేరకు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువులపై ఆరా తీస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఉదయం, రాత్రి వేళల్లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేశారు.

4 100 రోజుల ప్రణాళిక
విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు, 100 రోజుల ప్రణాళిక రూపొందించి ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు.

5 విద్యార్థుల దత్తత
చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకుని, సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగిస్తున్నారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి చదివిస్తున్నారు.

6 ప్రత్యేక తరగతులు
పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి ఒక గంట, సాయంత్రం 5.30 మరో గంట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

7 వారాంతపు పరీక్షలు
ప్రతీ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రతీ వారం కొత్త మోడల్ పేపర్ ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పెర్ఫార్మెన్స్ ఆధారంగా వారికి పాఠాలను బోధిస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

8 స్టడీ మెటీరియల్
జిల్లా విద్యా శాఖకు చెందిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు.

9 మోటివేషన్ తరగతులు
పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఉండే భయాన్ని తొలగించేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు పలు రంగాల్లో విజేతలుగా నిలిచిన వారిని తీసుకువచ్చి మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వారిలో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రతి రోజూ ఎక్సర్‌సైజ్ చేయిస్తున్నారు.

10 తల్లిదండ్రులతో సమావేశాలు
చదువు విషయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా, వారిలోని భయాలను తొలగించేందుకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రవర్తనకు అనుగుణంగా తల్లిదండ్రుల సూచనలతో వారిని సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా


ప్రజలకు వైద్య పరీక్షలు చేయిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

ఏయూ క్యాంపస్: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ భరోసా కల్పిస్తోందని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి అన్నారు. గురువారం ఉదయం స్థానిక చినవాల్తేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలకు కార్పొరేటర్ దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. ప్రజలకు సంక్షేమం అందించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఇటువంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వలంటీర్లు తమ పరిధిలోని అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించి వారికి సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి కృషి చేస్తున్నారన్నారు.

సంతపాలెం పాఠశాలలో కవలల దినోత్సవం


ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కవల పిల్లలు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి ప్రాంతం సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం కవల పిల్లల దినోత్సవంతో పాటు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న కవలలు రాముడు, లక్ష్మణుడుకు ప్రధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆశీర్వదించారు. అనంతరం కవల పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా


రైతులకు టోకెన్లు ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు గురువారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు ఒకసారి స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మద్రిపాలెం: అతివేగంగా వెళ్తున్న ఆటో ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొన్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 17న సాయంత్రం 6 గంటల సమయంలో 28 బస్‌స్టాప్ నుంచి కంచరపాలెం మెట్టు ఆశీర్వాదం కల్యాణ మండపం వైపు ఏపీ31టీఈ2586 నంబర్ గల ఆటో అతి వేగంగా వచ్చి రోడ్డుదాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళను ఢీకొనడంతో ఆమె కింద పడిపోయింది. ఆమె తలకు బలమైన గాయమైంది. అక్కడ ఉన్నవారి సహాయంతో 108లో ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చరీలో భద్రపరిచారు. సమాచారం తెలిసిన వారు నేరుగా మృతదేహాన్ని చూసి తమను సంప్రదించాలని పోలీసులు కోరారు. స్థానిక వీఆర్‌వో ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ సీఐ ఎ.ప్రసాద్ నేతృత్వంలో ఎస్‌ఐ అన్వర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మాతృభాషతో వ్యక్తిత్వ వికాసం

ఏయూ క్యాంపస్: వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష దోహదపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ తెలుగు విభాగంలో నిర్వహిస్తున్న తెలుగు భాష విశిష్టత సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం మార్కుల కోసం తెలుగు భాషను చదవడం సరికాదన్నారు. మనోవికాసాన్ని పెంపొందించే శక్తి మాతృభాషకు ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మాతృభాషతో పరిరక్షించుకోవడం వీలవుతుందన్నారు. రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ రేవూరి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు చదివిన వారికి అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, సమైక్య భారతి సమన్వయకర్త పి.కన్నయ్య, జి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

జాలరిపేటలో ఎంపీ ఎంవీవీ సహపంక్తి భోజనం


తెడ్డు రాము ఇంట్లో భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ గురువారం జాలరిపేటను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలువురు గ్రామస్తులతో ముచ్చటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. పలువురు గ్రామ పెద్దల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక చిన్నారులకు అందుతున్న విద్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జాలరిపేటలోని తెడ్డు రాము, పోలి ఇంట్లో విద్యార్థులు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

సీతంపేట: మద్యం, గంజాయి, డ్రగ్స్, ఖైనీ, గుట్కా, బెట్టింగులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రగతిశీల మహిళా సంఘం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ మనం ఎన్నికల జాతరలో ఉన్నామని, అభ్యర్థులు, పార్టీలు గతంలో హామీలు ఇచ్చేవారని, ఇపుడు ఎటువంటి హామీలు ఇవ్వడం లేదన్నారు. మహిళలపై హింస పెరగడంలో మద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి అత్యాచారాలు పెరుగుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు విమల, సావిత్రి భాయి పూలే ట్రస్టు వ్యవస్థాపకురాలు గూడూరు సీతామాలక్ష్మి, హెచ్‌ఆర్‌యూఎఫ్ అనూరాధ, అరుణోదయ నిర్మల, అడ్వకేట్ గిరిధర్, ఇఫ్టూ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మి

‘వార్వానివాస్’ వెబ్‌సైట్ ప్రారంభం

సీతమ్మధార: వార్వా నివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ‘వార్వానివాస్ డాట్ కాం’ అనే వెబ్‌సైట్‌ను జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. నగరం నలుమూలలా ఉండే అపార్ట్‌మెంట్ వాసులు, కాలనీ వాసులకు వార్వా నివాస్ సంఘం కార్యక్రమాలు, సందేశాలను సులువుగా చేర్చడం కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు ప్రెసిడెంట్ ఎస్.ప్రకాశ్‌రావు తెలిపారు. ప్రజా సమస్యలు, సంఘ కార్యక్రమాలు, మ్యాగ్జైన్‌లు, డాక్యుమెంట్లు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాల సమాచారం తదతర అంశాలను పొందుపరిచినట్లు చెప్పారు. వార్వా నివాస్ తీసుకొచ్చిన వైబ్‌సైట్‌ను, సంఘాల కార్యక్రమాలను, ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ అభినందించారు. నగరంలోని పార్కులను అందంగా, ప్రజాహితంగా నడపడానికి వార్వా నివాస్ సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు పి.లచ్చిరాజు, జనరల్ సెక్రటరీ పిట్టా నారాయణమూర్తి, బి.బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

పైడయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎంవీపీ కాలనీ: ఇటీవల అనారోగ్యంతో మరణించిన వాసుపల్లి పెద్ద పైడయ్య కుటుంబ సభ్యులను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. గురువారం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని పైడయ్య ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11 కేవీ కై లాసగిరి ఫీడర్ నిర్వహణ, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు జరుగుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కై లాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో నేతాడ శ్రీను కుటుంబంతో నివాసముంటున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారుల్లో రెండో కుమారుడు కృష్ణ(28) కారు ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో నిత్యం పని ఉండదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సరిగా పనిలేకపోవడం, మద్యానికి కావల్సిన డబ్బులు చేతిలో లేకపోవడంతో ఆత్మహత్యకు పూనుకున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో తూర్పు నియోజకవర్గంలో పేద కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. హనుమంతవాక రామాలయం వీధిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. పొందిన లబ్ధి గురించి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టామన్నారు. అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డులో సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రామాలయం వీధిలో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

వైభవోపేతంగా లలితా కామేశ్వరుల కల్యాణం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 75వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పురోహితుడు మాచవోలు రమేష్‌శర్మ వేదమంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. లలితా కామేశ్వరుల విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. ముందుగా లలితాకామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం పరిసరాలను పూలు, పండ్లతో చూడముచ్చటగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్య ధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు.


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కేవీలో ఘనంగా థింకింగ్ డే వేడుకలు

తాటిచెట్లపాలెం: పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో వజ్జా మణిబాబు ఆధ్వర్యంలో గురువారం థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకులు లార్డ్ స్టీవెన్ సన్‌బాడెన్ పౌల్, లేడీ బాడెన్ పౌల్‌ల జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జీత్ బాడెన్‌లార్డ్ దంపతుల చిత్రపటానికి నివాళులర్పించారు. సంగీతం అధ్యాపకుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ గొప్పతనాన్ని వివరించారు. 3వ తరగతి నుంచి చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 3 నుంచి 5వ తరగతి బాలికలను బుల్‌బుల్స్ అని, బాలురను కబ్స్ అని పిలుస్తారని, 6వ తరగతి దాటిన బాలురను స్కౌట్స్ అని, బాలికలను గైడ్స్ అని పిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సౌట్స్ అండ్ గైడ్స్ నాట్స్, కుకింగ్, ప్రథమ చికిత్స, టెంట్ మేకింగ్, క్లే మౌల్డింగ్, పెయింటింగ్ వంటి అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.మీనా, ప్రధానోపాధ్యాయిని శైలజ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, షాహ్లానస్రీన్, సత్యనారాయణ, కుందన్‌లాల్, మిట్టపల్లి రేఖ పాల్గొన్నారు.


సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తదితరులు

విద్యార్థులకు సమయపాలన ముఖ్యం

సీతమ్మధార: ప్రతి విద్యార్థి సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, లింగ్విస్టిక్స్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్(యూఎస్‌ఏ) రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గెస్ట్ ఫ్యాకల్టీ ఎస్.వి.ఆర్.నాయుడు సూచించారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు ముఖ్య అతిథిగా ఆయన వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు వెళ్లే సమయంలో టైం మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఒక ప్రణాళిక ప్రకారం చదవడంతోపాటు నైపుణ్యాల సాధన, కమ్యూనికేషన్ స్కిల్‌పై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్, తెలుగు టీచర్ జి.ఎస్.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ నాయుడు